# మీరని మేరలు

సబ్-వేపైమెట్ల మీద నిలబడి ఆత్రంగా కిందకు - సొరంగంలోనికి - చూస్తోంది అమిత.

మెట్లనిండా బోలెడంత దుమ్ము పేరుకుపోయి ఉంది. పెద్ద పెద్ద కాగితాలు, తుంపులు, ప్లాస్టిక్ సంచులు ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా ఎగిరి ఎగిరి పడుతున్నాయి, సన్నని గాలి తెరలకు కూడా.

సొరంగంలో చూద్దామంటే - మనుషులు నడవటానికి ఎక్కువ చోటు మిగల్చ కుండా పేవ్‌మెంట్ కంటే అన్యాయంగా రహదారికి రెండుపక్కల రకరకాల దుకాణాలు గచ్చుచప్టా మీద స్థావరించుకున్నాయి. ఆటబొమ్మలు, రకరకాల గాజులు, గుడ్డసంచులు, ప్లాస్టిక్ సామాన్లు, విసిన కర్రలు - ఇలా ఎన్నో నిత్యావసర వస్తువులలా అనిపించే నిరుపయోగమైన సరుకులు.

ఎడంచేత్తో రెండేళ్ల కుర్రవాడిని గట్టిగా పట్టుకుంది అమిత. వాడు విడిపించుకు పోయి జనంలో కలిసిపోతాడేమోనని ఆదుర్దా. కుడిచెయ్యి గుండె ఆదిమిపట్టుకుంది. లోపల నుంచి జనం పైకి వస్తున్నారు.

ఆమె ఎంతకూ కిందకు దిగకపోవడం - అక్కడికి ఓ పదిగజాల (ఎన్ని మీటర్లు?) దూరంలో టాక్సీ ఆపుకుని విశ్రాంతిగా పక్కన నిలబడ్డ డ్రైవర్ ముకుందా నికి కాస్సేపు ఆశ్చర్యంగానే ఉండింది.

కుర్రాడు దూరంగా ఎటో చూస్తున్నాడు.

ఆగు - అని సైగతోనే ఆపుతోంది వాడిని అమిత.

ఆమె ముఖం దాదాపు దీనంగా నిరాశగా మారిపోతోంది సమయం గడుస్తున్న కొద్దీ. కుడిచేతితో పమిట అంచు తీసుకుని గొంతు, చెంపలు రుద్దుకుంది.

తలపైకెత్తి ఎన్నో వాహనాలు రోడ్డు మీద వెళ్లడం చూస్తోంది. ఎందరో మనుషులు - బిలబిల నడిచిపోతున్నారు.

ఎంతసేపు ఇలా నించోవాలి ? ఆ మనిషి వస్తుందా రాదా ? - అని చికాకు కనిపిస్తోంది ఆమె ముఖంలో.

ముకుందం - తాను కూడా పంతం పట్టినట్లు - అలాగే చూస్తూ నించున్నాడు. దగ్గరకు వెళ్లి పలుకరిద్దాం అనిపించింది.

ఏమని పలుకరించడం ?

ఎవరని ?

- మాధవరావు చెప్పాడు గనుక ఈ పని చేస్తున్నాడు గాని, ఇటువంటి ''పత్తేదారు'' వ్యవహారాలలో అతనికి అసలు అభిరుచి లేదు.

ఆమె మెట్ల దగ్గర్నుంచి కాస్త పక్కకు జరగడం కనిపిస్తోంది.

ఆకాశం వేపు చూచింది.

ఇంకో అరగంటలో సూర్యుడు అస్తమిస్తాడు.

ఈ లోపల --

ఏం జరుగుతుందో !

అసలు ఏమన్నా జరుగుతుందో లేదో అమితకు అనుమానమే !

మళ్లీ మెట్ల దగ్గరకు వెళ్లి లోతుగా చూచింది.

ముఖంలో అదే నిరాశ.

ఉన్నట్లుండి యేదో ఉత్తేజం కలిగినట్లయింది.

మెట్ల మీదుగా ఓ యాభయి ఏళ్ల మనిషిపైకి వస్తోంది. అమిత ఆమెను పూర్తిగా పైకి రానిచ్చింది.

రోడ్డు మీదకు చేరాక - ఎదురుగా వెళ్లి నిలబడింది.

ఏమిటో చెప్పింది.

ముకుందానికి వినిపించడం లేదు. వినిపించేటంత దగ్గరగా వెళ్లి నిలబడాలంటే బిడియం. అమితకు తనను ఎవరో 'ఫాలో' అవుతున్నారని అనుమానం రావచ్చు!

ఆమెను అటకాయించడం మటుకు కనిపిస్తోంది.

అమిత ఏమిటో చెబుతూ ఉంది, ఆ పెద్దామెకు. పిల్లవాడి వైపు చూపిస్తోంది.

వాళ్లిద్దరి హావభావాలను బట్టి సంభాషణ ఊహించుకుంటున్నాడు ముకుందం. పెద్దామె ముఖంలో ఏమీ ఉత్సాహం లేదు. తనను కలుసుకున్న మనిషితో ఆమెకు మాట్లాడడమే ఇష్టం లేదు.- అనిపిస్తోంది ఆమె వాలకం చూస్తూ ఉంటే.

నాకేం సంబంధం ? ఎందుకు నన్ను ఇట్లా రోడ్డుమీద నిలబెట్టేస్తావు - నేను త్వరగా ఇంటికి వెళ్లాలి - అంటున్నట్లు ఉంది ఆమె.

అమిత కూడా జోరుగానే మాట్లాడుతోంది.

నేనూ ఇంటికి వెళ్లాలి. నాకూ పనిపాటలు ఉన్నాయి. నువ్వు వస్తావని అరగంట నుంచి ఇక్కడ కాపువేసి నించున్నాను – అంటున్నట్లు ఉంది అమిత.

పిల్లవాడు. వీడికి తిండిలేదు. నేను ఏమయినా ఫరవాలేదు. వీడికోసమే నాకు ఈ అగచాట్లు అన్నీ – అని వివరిస్తున్నట్లుగా ఉంది, అమిత ధోరణి.

పెద్దామె చేతిలో సంచి బరువుగా ఉంది.

కాస్సేపు దాన్ని నేలమీద ఆన్చింది.

అయితే నన్నేం చేయమంటావు - అన్నట్లుగా చికాకుగా అసహ్యం కనపరుస్తూ అమిత వేపు చూచింది.

అమిత ఇంకా తన ధోరణిలో తమ మాట్లాడుకుంటూ పోతూనే ఉంది - పెద్దామెకు మాత్రమే వినపడేటట్లుగా.

రోడ్డు మీద 'సీన్' క్రియేట్ చేయడం నాకూ ఇష్టం కాదు. నీకు కావలసింది ఇచ్చెయ్ - నా దారిని నేను పోతాను - అంటున్నట్లు ఉంది అమిత.

పెద్దామె సంచి మళ్లీ చేతుల్లోకి తీసుకుంది.

జిప్ తెరిచి లోపలనుంచి ఓ పెద్ద పర్స్ తీసింది.

సంచిని మళ్లీ నేలమీద పెట్టింది.

పర్స్ జిప్ కూడా తీసింది.

అమితకు కనబడకుండా లోపలున్న కాగితాలన్నీ పరిశీలించుకుంది. రెండు మూడు క్షణాల తరువాత ఓ కరెన్సీ నోట్ బయటకు తీసింది. ఇర్వైయ్యో, యాభయ్యో ముకుందం గమనించలేకపోయాడు.

పెద్దామె చేయిచాపి ఆ నోటు అమితకు అందించింది.

అమిత అందుకో లేదు.

ఇంకా యేమిటో చెబుతోంది.

వాదిస్తోంది.

ఒక్క క్షణం కుర్రవాడు పట్టు వదిలించుకున్నాడు.

రెండడగులు పక్కకు వేశాడు.

అమిత అమాంతం ఎగిరినట్లుగా ముందుకు దూకి వాడిని పట్టుకుంది. మళ్లీ పెద్దామెతో వాడిని చూపించి ఇంకా ఏమేమిటో చెబుతోంది. పెద్దామె ముఖం బాగా ముడుచుకు పోయింది. కుర్రవాడిని దగ్గరకు తీసుకునే ప్రయత్నం చేసింది. కాని అమిత పడనివ్వలేదు.

అమిత మళ్లీ పమిట కొంగుతో గొంతు, చెంపలు రుద్దుకుంది. కుడిచేత్తో ఏదో అభినయం చేస్తూ చెబుతోంది.

పెద్దామెకు చికాకు ఎక్కువయింది. రోడ్డుమీద కాళ్ల దగ్గరగా పెద్ద సంచి. చేతిలో పర్సు, విడిగా తీసిన కరెన్సీ నోట్. నాలుగు దిక్కులా చూచింది, ఎవరయినా పోగవుతున్నారా - అని.

ఎవరిదారి వారిది. ఎవరూ గమనించడం లేదని గమనించి హాయిగా నిట్టూర్పు విడిచింది పెద్దామె. అయితే ఏమంటావు ? -- గద్దించినట్లుగా పిడికిలి బిగించి సైగ చేస్తూ అడిగింది అమితను.

అమిత తన మామూలు పాటే పాడుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది ముకుందానికి.

పెద్దామె మళ్లీ పర్సు జిప్ తీసింది.

తిరిగి లోపలి కాగితాలన్నీ పరిశీలించింది.

ఈమారు మరిన్ని 'కరెన్సీ నోట్సు' బయటకు లాగింది.

అన్నీ కలిపి గుప్పెట్లో పట్టుకుంది.

అమిత ఆత్రంగా చూస్తూ ఉంది ఆమె చేష్టలన్నీ.

నా దగ్గర ఇంతే ఉంది - అన్నట్లుగా చెబుతూ ఆ నోట్ల కట్ట అమిత కుడిచేతిలో గుచ్చింది.

ఈమారు అమిత తీసుకోను - అనలేదు. ఆ కాగితాలు తన చేతిలోనే ఉండనిచ్చింది. అయినా ఇంకేదో మాట్లాడుతూనే ఉంది.

పెద్దామె జిప్ మూసింది. పర్సు పెద్ద సంచిలో పెట్టుకుంది. కొద్దిగా వంగి పెద్ద సంచి చేతుల్లోనికి తీసుకుంది. ఇక వెడతాను - నీ ఇష్టం - అన్నట్లుగా అంటూంది అమితతో.

అమిత ముఖంలో ఆనందం లేదు.

చికాకు మరింత ఎక్కువ అయింది.

నీరసం కొట్టవచ్చినట్లుగా ముఖమంతా కమ్మేసింది.

పెద్దామె వెనక్కి చూడకుండా ముందుకు నడిచి పోవడం మొదలుపెట్టింది. అమిత ఇంకా యేదో మాట్లాడుతూనే ఉంది. పెద్దామె వినిపించుకోకుండా దూరం కదిలేక, అమిత ఆమె అందించిన 'నోట్' కాగితాలు లెక్కపెట్టుకుంది. ఎక్కడి నుంచో అకస్మాత్తుగా ఆమె చేతిలో ఓ పర్స్ సాక్షాత్కరించింది. ఈ నోట్లు దాన్లో భద్రపరుచుకుని పర్స్ మళ్లీ బొడ్లో దోపుకుంది. అంతకు ముందు ఆమె చేతిలో పర్స్ లాంటిది ఏమీ లేదనీ, కనీసం జేబు రుమాలు అయినా లేదనీ గమనించాడు ముకుందం. ఆడవాళ్లు ఎంత జాగ్రత్తపరులు - అనుకున్నాడు.

ఆమె ఇప్పుడు ఏం చేస్తుందో చూడాలనిపించింది అతనికి.

కాస్త ముందుకు అడుగులు వేశాడు.

టాక్సీ రోడ్డు వారగా భద్రంగానే ఉంది గదా అని ఒకమారు చూచుకున్నాడు.

ఆమె సబ్-వే మెట్లు దిగి వెళ్లిపోతుందేమో, అలా అయితే కలుసుకోవడం కష్టం- అనుకున్నాడు.

అమిత కుర్రవాడిని దగ్గరకు తీసుకుంది. వాడి ముఖం అరచేత్తో ఒకమారు నిమిరింది. వాడు రోడ్డు అవతలవేపు దుకాణాల వంక చూపిస్తున్నాడు. వాడు ఏదో మాట్లాడుతున్నాడు. అవన్నీ వినే ఓపిక, తీరిక లేదు అమితకు.

కుర్రవాడిని చంకకు ఎత్తుకుంది.

సబ్-వే పక్కనుంచి నడవడం ప్రారంభించింది.

అమ్మయ్య - అనుకున్నాడు ముకుందం.

ఆమె ఇప్పుడు దగ్గరగా వచ్చింది.

ముఖంలో అదే నీరసం - నిస్త్రాణ.

దగ్గరగా చూచినప్పుడు అనిపించింది ముకుందానికి, కనీసం ఆమె రెండు మూడు రోజులుగా ఏమీ తిని ఉండదని!

బాగా చదువుకున్న మనిషిలా అనిపించింది.

తీరైన మనిషి.

ఒకమారు చూస్తే మళ్లీ చూడాలనిపించకపోవడం కుదరదు.

- మాధవరావు ఈమెను గురించి ఏమీ వ్రాయనే లేదు. అడ్రెస్ మాత్రం ఇచ్చి కాస్త కనిపెట్టి ఉండమనీ - ఎలాంటి అఘాయిత్యం చేయదనుకో - అయినా గమనించు - అన్నాడు, అంతే.

ముకుందం ఆమెతో నింపాదిగా అన్నాడు.

'బాగా నీరసంగా ఉన్నారు. ముందు కాస్త కాఫీ -' ఎదురుగా ఉన్న హోటల్‌వైపు చేయిజాపి చూపించాడు.

• • •

హాయిగా నిద్రపోవటాన్ని మించిన ఆనందం మరొకటి లేదని మాధవరావుకు ఎప్పుడో తెలిసి పోయింది. కాకపోతే దీనిని అమలు చేయటంలోనే కొన్ని ఇబ్బందులు వదలకుండా ఉన్నాయి.

చేతినిండా పని.

ప్రతి పనిని వాయిదా వేసి పీకల మీదకు వచ్చేంత వరకు ఏమీ చేయకుండా ఉండడం కూడా బాగా అలవాటు అయిపోయింది.

ఏ పనీ చేయకుండా కూర్చోవడం చాలా తేలిక. అయితే మనసులో ఆలోచనలు మటుకు ముసురుకు వచ్చి ఏ పనీ చేయకుండా కూర్చోవడం ఎలాగో అర్థం కాదు!

ఈ వారాంతంలోనే ఊరికి వెళ్లవలసిన అవసరం వెంట తరుముతోంది. వారం రోజుల పాటు ఊళ్లో లేకుండా పోవడం అంటే ఎంత ఏర్పాటు చేసుకోవాలి?

ముఖ్యంగా పై ఊళ్లో తన అవసరాలన్నీ ఎలాంటి ఇబ్బంది లేకుండా గడిచి పోయేంత డబ్బు సమకూర్చుకోవాలి, ముందు. ఊరికే కులాసాగా కాలం గడిపి వేయడం కోసం చేస్తున్న ప్రయాణం కాదు. అక్కడ కలుసుకోవలసిన మనుషులు, వాళ్లతో సంభాషణలు చేసేటప్పుడు విధిగా తీసుకోవలసిన జాగ్రత్తలు - ఓ జాబితా తయారు చేసుకోవాలి. రెండు సంవత్సరాల నుంచి - తరువాత చూచుకుందాం లే- అని తాత్సారం చేస్తున్న పనులు ఈ వారం రోజుల మకాంలోను నిశ్శేషం చేసి వేయాలి.

బంధుమిత్రులకు ఉత్తరాలు వ్రాయవలసిన పని పదిహేను రోజుల నుంచి అలాగే ఉండిపోయింది పోస్ట్ పర్సన్ రానంత వరకు ఒకటే ఆదుర్దా మనసుకు. తీరా వచ్చిన తరువాత - ఉత్తరాల కట్ట చూడడం తోటే దిగులు. వీటన్నిటికీ జవాబు వ్రాయడం తనవల్ల అయ్యే పనేనా ?

ఎన్నో పుస్తకాలలోంచి కొటేషన్లు తయారు చేసుకోవాలి.

ఆ పోగు చేసిన వాక్యాలు సందర్భానుసారంగా మలుచుకుని ఎప్పుడు ఏది ఉపయోగించాలో తిన్నగా మనసుకు చెప్పుకోవాలి.

మతిమరుపు వయసుతో పాటు పైన పడుతోంది - అని ఎవరూ తనను గురించి పొరపాటున అయినా అనుకోకుండా ఉండేందుకు ఎంతో శ్రమపడడం తప్పనిసరి అవుతోంది.

భోజనం చేసి కొంతసేపు విశ్రాంతి తీసుకున్న తరువాత సేరుగా వ్రాతబల్ల దగ్గరకు చేరి సాయంకాలం వరకు దాన్నే ఆశ్రయించుకుని ఉండిపోవాలని తీర్మానం చేసుకున్నాడు మాధవరావు.

అసలు ఉదయం లేవడంతోటే వ్రాతబల్లకు అంకితం అయి కూర్చుందా మంటే - ఎంత ప్రయత్నం చేసినా కుదరలేదు.

కాఫీ తాగకుండా ఏ పనీ ప్రారంభం కాదు.

కాఫీతో పాటు న్యూస్ పేపర్ల దొంతరలు వచ్చిపడతాయి. రెండు ఇంగ్లీషు పేపర్లు, నాలుగు తెలుగు పేపర్లు, హెడ్డింగులు చూచి అతిముఖ్యం అనుకున్న వ్యాసాలు చూచాయగా చూసేసే సరికి భోజన సమయం అవనే అవుతుంది.

ఉదయం పూట మరే పనీ పెట్టుకోకుండా - కనీసం రేడియో వార్తలయినా వినకుండా పనిలోనే కూరుకు పోదామంటే అది ఎంత మాత్రమూ వీలయే పనికాదు. ప్రపంచం ఏమయిపోతోంది, ఏమవుతోందని వివిధ పత్రికల వాళ్లు భావిస్తున్నారు - అన్న విషయాలు తెలుసుకోకుండా రోజు ప్రారంభం చేయడం అవివేకం.

తాను చేయాలనుకున్న పనులు ఇంకెవరయినా అప్పుడే చేసి వేశారేమో పత్రికలు చూస్తేగాని తెలియదు. అలా జరిగినప్పుడు - ఒక పని అయినా తగ్గినట్లే గదా అని ఆశ! ఈ ఆధునిక ప్రపంచంలో మనిషిని శాసిస్తున్నవి. ఏవయినా ఉన్నాయనుకుంటే అవి తప్పనిసరిగా పత్రికలే - అయి ఉండాలి.

మధ్యాహ్నం నిద్రపోవడం ఆరోగ్యానికి మంచిది.

ఉదయం పడిన శ్రమ అంతా కరిగిపోతుంది. మనిషి తాజాగా తయారై తన పనికి తాను పూనుకోవచ్చును.

ఆ నిద్ర మోతాదు మించి సాయంత్రం నాలుగింటి వరకు సాగిందంటే ఇంక ఆ రోజుకు ఏమీ పని చేయగల ప్రాప్తం ఉండదు. దాదాపు ప్రతి రోజు ఇలాగే జరిగిపోతున్నా మాధవరావుకు ఇందువల్ల ప్రత్యేకంగా ఏమీ మనఃతాపం లేదు. పనులకేం వచ్చె - ఎప్పుడయినా చేసుకోవచ్చు !

ఒక రోజుకు ఒక రోజు గడిచి పోతున్న కొద్దీ చేయవలసిన పనుల జాబితా సుదీర్ఘమైన రైలు బండిలా తయారయిపోతోంది. మనస్సు మరీ అనేక అభిప్రాయాలకు 'జంక్షన్' అవడం వల్ల ఈ రైలు బండికి ఎప్పటికప్పుడు అనేక దిక్కుల నుండి రకరకాల కంపార్ట్‌మెంట్స్ వచ్చి చేరుకుంటున్నాయి. ఆ కంపార్ట్‌మెంట్లకు వరుస నెంబర్లు వేసుకోవడంలో కూడా గందరగోళం ఏర్పడుతోంది.

లాభం లేదు. ఇలా కాలయాపన చేయడం ఎంత మాత్రం బుద్ధికి లక్షణం కాదు. దేనికయినా మితి ఉండాలనుకున్నట్లే బద్ధకానికి కూడా సరిహద్దు యేర్పరుచుకోవడం అవసరం.

కొత్తగా పేరు ప్రతిష్ఠలు సంపాదించుకోవడం మాట అలా ఉంచి, ఇంత వరకు ఏ మాత్రం శ్రమ పడకుండా - చెమట ఓడ్చకుండా - శరీరం అలవకుండా - దానంతట అదే దగ్గరకు చేరిన మంచిపేరును కాస్తా పాడు చేసుకోవడం ఎందుకు ?

మాధవరావుకు చాల గర్వం, అతిశయం - తనకు ఎంత మాత్రమూ గర్వం లేదనీ స్వాతిశయం లేదని ! తన పనులు చెడుపుకుని అయినా ఇతరుల పనులు చేస్తానని ! అన్నమాట ప్రకారం నడుచుకుంటానని ! - అతని మీద అతనికి గొప్ప నమ్మకం !

'మీకు గుర్తుందో లేదో - ఈ సాయంత్రం మీరు తప్పకుండా ఫలానా క్లబ్‌కు వెళ్లాలి సుమండీ !' అని గుర్తు చేసింది లత.

'వెళ్లకపోతే ఏం అవుతుందట?' - కొంటెగా అడిగాడు మాధవరావు. ఆమె ఏం జవాబు చెబుతుందోనని ఉత్సాహం. నిజానికి వెళ్లి తీరాలని తనకు కూడా తెలుసు.

ఆకాశం విరిగి మీద పడదనుకోండి - అంటూ ప్రారంభం చేసింది లత. ఆమె మాటలను మొదట్లోనే అరికట్టకపోతే ఇలా ఎంత మాత్రము జరగనివి, నిజంగా జరిగినా ప్రపంచం తల్లకిందులు అయిపోనివీ - ఎన్నో జాబితాగా చెప్పేస్తుంది ఆమె!

'మీ స్నేహితుడు శేఖరం గదూ మాట్లాడేది ఇవాళ? వెళ్లకపోతే ఏం బాగుంటుంది?'

అతను భార్యాసమేతంగా వస్తాననీ, సభ అయిపోవడం తోటే మీరిద్దరూ, మేమిద్దరం కలసి ఏదయినా ప్రశాంతంగా ఉండే రెస్టరెంట్‌కు వెళ్లి కులాసాగా కబుర్లు చెప్పుకుందామనీ అతను వారం రోజుల కిందటనే ఫోన్లో మాట్లాడి 'ఫిక్స్' చేసుకున్నాడు.

అయిపోయింది. ఇంక ఈ రోజుకు తను అనుకున్న పనులు చేయడం ఉట్టి మాటే. ఇవన్నీ తప్పనిసరిగా రేపు మధ్యాహ్నం, సాయంత్రం - కూర్చుని చేసుకోవాలి.

'మనం ఆరుగంటలకు బయలు దేరితే చాలు. అంటే ఇప్పుడు మీ ముందు ఇంకా మూడు గంటలు పరుముకు ఉన్నాయి. కావాలనుకుంటే ఎంత పనయినా చేయగలరు, ఈ సమయంలో' - అని ఒకపాడి కూడా అతికించింది లత.

కనీసం పది ఉత్తరాలు వ్రాసుకోవచ్చు.

నూరు పేజీలు చదివేయవచ్చు.

కాగితాల బొత్తులు పరిశీలించి. ఒక క్రమంలో పెట్టుకోవచ్చు.

'నోట్స్' తయారు చేసుకోవచ్చు. - ఇలా చేయగల పనులన్నీ జాగ్రత్తగా పరిశీలించుకోవచ్చు.

ఆ మిత్రుడు, అతని భార్య ఎన్నో కొత్త సంగతులు చెబుతారు, వాళ్లు ఏం చెబుతారో ఊహించుకోవచ్చు.

వాళ్లను కలుసుకుని దాదాపు మూడు నెలలు అయింది.

ఈ తొంభై రోజుల్లో వాళ్లు ఏమేం చేశారో, ఎలా చేశారో సవివరంగా చెబుతారు. వాటిమీద తన, తమ వ్యాఖ్యానాలు కూడా అడుగుతారు. వాటన్నిటినీ సజావుగా విని, తార్కికంగా మాట్లాడడానికి తయారవడం ఓ పెద్ద పని.

ఊరికి దూరంగా ఉన్నారు గనుక ఎక్కువ స్నేహితుల దాడి, బంధువుల రాకపోకలు లేవు. సమాచారాలన్నీ ఉత్తరాల మీద, ఆలోచనలలోనే సరఫరా అవుతూ ఉంటాయి.

ఎప్పుడేనా ఏ బంధువో అకస్మాత్తుగా ఊడిపడి, 'అబ్బ, మీ ఇల్లు చాలా దూరం'

రావటానికే గంటన్నర పట్టింది నాకు. అయినా ఇంత దూరంలో ఎలా ఉంటున్నారు ఒంటరిగా ?' అంటాడు.

మాధవరావు నవ్వడమే జవాబు. 'అందరూ సెంట్రల్ స్టేషన్‌లోనే ఉండలేరు కదా !' అంటాడు మరీ బదులు చెప్పవలసి వచ్చినప్పుడు.

ఒంటరితనం అందరినీ ఒకే రకంగా బాధించదు.

దూరం - అంటే దేనికి దూరం ?

ఆవలించడం కూడా మరిచిపోయి అవతలి మనిషిచెబుతున్న విషయాలు వింటూ కూర్చుంటే ఎంత సమయం అయినా గడిచిపోతుంది.

ఈ పని నీ వల్లనే కావాలి. నీ మీదనే ఎంతో ఆశపెట్టుకుని వచ్చాం - అంటాడు బంధువు.

నావల్ల యేపనులూ కావు..నాకెవరూ పరిచయస్థులు లేరు అని చెప్పడం తేలికే. కాని ఆ మనిషి నమ్మడు.

ఇన్నాళ్ల నుంచి - ఇన్నేళ్లనుంచి ఇక్కడ ఉన్నావు. నీకు ఫలానా మనిషి తెలియకుండా ఎలా ఉంటాడు ? నువ్వు ఒక్కమాట చెబితే చాలు - అంటాడు మరీ ధైర్యంగా.

తన మీద ఇతరులకు ఉన్న విశ్వాసంలో పదో వంతయినా తనకు ఉంటే ఎంత బాగుండేది ? - అనిపిస్తుంది, అలాంటి మాటలు వింటూ ఉన్నప్పుడు.

యుక్తిగా తను ఈ జాలం లోంచి తప్పించుకుందుకు చూచినా, ఆ బంధువు తన పని దాదాపుగా సఫలం అయిపోయినట్లే భావిస్తూ మాట్లాడడం చూచిం తర్వాత ఇందులో నేను జొరబడకపోతే ఎట్లా అనిపిస్తుంది మాధవరావుకు.

ఇలాంటి సందర్భాలు ఎన్నో !

అన్నింటికీ తల ఊపడమే, తల ఒగ్గడమే అయిపోతోంది చివరకు.

'మళ్లీ నిద్రపోతున్నారా -- బుద్ధిగా పనిచేసుకుంటున్నారా - అని చూద్దామని వచ్చాను. అంతకంటే ఇంకేం లేదు' - అంది లత తలుపు ఓరగా తీసి తొంగి చూస్తూ.

పని చేసుకుంటున్న పోకడలు ఏమీ కనబడకపోవడం వల్ల కావును - లోపలకు రానే వచ్చింది.

'ఏమిటి ఆలోచిస్తున్నారు ? -- కనీసం తెరచి ఉన్న పుస్తకం అయినా బల్లమీద లేదే - కాగితాలు కలం లేకపోతే మానె ! -' అంది

ముద్దాయిలా ముఖం పెట్టాడు మాధవరావు.

'ఏ పని ప్రారంభం చేద్దామా అని ఆలోచిస్తున్నాను - ఇంకా ఆలోచన ఒక తీరుకు రాలేదు-' అన్నాడు చిరాకుగా.

'మరో కప్పు కాఫీ ఇవ్వమంటారా ?'

'ఇస్తే ఇవ్వు -' అన్నాడు అనాసక్తంగా 'కాఫీతో పాటు, రెండు బిస్కట్లు'.

లత తల ఊపుతూ వెళ్లిపోయింది.

అతను మళ్లీ తల ఇటు తిప్పేసరికి అవి సిద్ధంగా బల్లమీద స్థావరించుకున్నాయి.

కంటినిండా నిద్ర - కడుపు నిండా కాఫీ - ఈ రెంటిలో దేనికి ప్రథమ స్థానం అన్నది మాధవరావుకు ఎప్పటికీ నిర్ధారణ కాదు. అవి రెండూ లేకపోతే అసలు మనిషి ఉనికికి - అస్థిత్వానికి - విలువ లేదనేది ఏమాత్రం వివాదానికి ఆస్కారం లేని అభిప్రాయం.

'నిన్న మధ్యాహ్నం కమలాకరం వచ్చాడు. చెప్పానా ?' అనడిగింది లత. చెప్పలేదని తల అడ్డంగా ఊపాడు మాధవరావు.

కమలాకరం - చిన్నప్పుడు బంతిలా గెంతుతూ ఎంత చలాకీగా - చురుకుగా పట్టుకోవటానికి చిక్కకుండా ఉండేవాడు.

ఇప్పుడు - పాతికేళ్లు దాటిపోయాక, అప్పటి కమలాకరం ఇతడే అంటే ఎంత మాత్రం నమ్మటానికి వీల్లేకుండా తయారయ్యాడు - అంటుంది లత.

జీవితం తీసుకు వచ్చిన పరిభవాలు, ప్రభావాలు - అతని మీద వికృతమైన ముద్రలు మిగిల్చాయి.

'ఏమంటాడు ? ఏమన్నా విశేషమా ?'

'అమిత నాన్నగారు మళ్లీ ఉత్తరం వ్రాశారట. అమ్మాయి అట్లా విడిగా ఉండటం బాగోదు. ఈ నెలలోనయినా తీసుకు వెళ్లమని.'

'ఇంకేం? లక్షణంగా తీసుకు రమ్మను-'

'అమిత కూడా ఉత్తరం రాసిందట : ''నాన్నగారు అలాగే రాస్తారు. మీరేం బయలు దేరి రాకండి. నేను రాను -'' అని.

మాధవరావు ముభావంగా ఉండిపోయాడు.

లత 'మీరు కలుగ జేసుకోకపోతే అతడికి మరింత పిచ్చెక్కేట్టు అనిపించింది నాకు' అంది.

'మరేం చెప్పావు?'

'మీ సలహా కోసం వచ్చాడు. ఇవాళ సాయంత్రం క్లబ్ దగ్గరకు వచ్చి మిమ్మల్ని కలుసుకుంటానన్నాడు'.

'నా మాట అలా ఉంచు. నువ్వేం చెప్పావు ?'

'మామూలు మాటే, తప్పకుండా తీసుకు రమ్మన్నాను. రెండు నెలలు మన ఇంట్లోనే అట్టిపెట్టమన్నాను'

'మరి అమిత రానని రాసిందిగా !'

'దాని మొహం ! దానికేం తెలుసు ? రెండు నెలలు నా దగ్గర ఉంచుకు అసలు వాళ్లిద్దరికీ ఎందుకు సరిపడడం లేదో కనుక్కోవాలి నేను-'

అమిత ఎవరో కాదు.

లతకు సాక్షాత్తు అక్కగారి కూతురు.

పెళ్లయి, కాపురానికి వచ్చిన రెండోనెలలోనే చెప్పా పెట్టకుండా పుట్టినింటికి పారిపోయింది - ఆ మొగుడి తీరు ఏమీ బాగుండలేదని ! తల్లిదండ్రులు ఎలా సర్దిచెప్పారో గాని ఒక నెలరోజుల్లోనే మళ్లీ ఆమె కాపురం సరిపడింది. తరువాత మూడేళ్ల వరకు ఎలాంటి పొరపొచ్చాలు లేవు.

'సరే ! కమలాకరం ఏమన్నాడు ?'

'నాతో ఏం చెప్పలేదు. మీరే కనుక్కోవాలి అతని అంతరంగం - నాలుగయిదు రోజులు మాటల్లో పెట్టి'

తనముందు మరో పెద్దపని - రాచకార్యం - పన్నగంలా పడగ విప్పుతోందని గమనించాడు మాధవరావు.

'ఒంటరి సంసారాలు మంచీ చెడ్డ చెప్పేవాళ్లు ఎవరూ లేరు. అంతకంటె ఇంకేం కారణం కనబడదు -' అంది లత.

అవన్నీ నిన్నటి రోజుల మాటలు.

మంచి - చెడ్డ - ఈరోజున మనిషికి ఎవరయినా చెప్పాలా ?

చెప్పకుండానే ఎవరికి వారికి తమకు ఉచితమైన, యుక్తమైన పని ఏమిటో తెలియదా?

వర్తమానంలో బతకరు మనుషులు.

గతంలోనో, భవిష్యత్తులోనో ఇమిడి పోతారు. అదే లోకం అనుకుంటారు.

మాధవరావుకు ఉపాయం స్ఫురించింది.

'సరే చూద్దాంలే. సాయంత్రం వస్తాడుగా ! -' అని ప్రస్తుతానికి ఆ విషయం చర్చకు తీసుకు రావడం అణిచివేశాడు.

• • •

అమిత అతన్ని ఎదురుగా నిలబడి చూచింది.

ఏమీ మాట్లాడలేదు.

నింపాదిగా అడుగులు వేస్తూ 'జీబ్రాలైన్స్' దగ్గరకు వచ్చింది. రోడ్డు దాటుతుందన్న మాట.

ముకుందం ఆమె వెనుకగా - పక్కగా నడుస్తున్నాడు.

దారి చూపిస్తున్నాననుకుంటున్నాడు. ఆమె అతని కోసం ఆగటం లేదు. తన దారిన తను మెల్లగా అడుగులు వేసుకుంటూ రోడ్డు దాటింది.

ఓ మాదిరి రెస్టరెంట్ అది.

కుర్రవాడిని ఒక చంక నుంచి మరో చంకకు బదిలీ చేసుకుంది. అరచేత్తో గొంతు, చెంపలు మళ్లీ రుద్దుకుంది.

మూడు మెట్లు ఎక్కిరెస్టరెంట్ లోపలకు నడిచింది.

నేరుగా వెళ్లి ఫ్యామిలీ రూంలో ప్రవేశించింది.

కుర్రవాడిని ఒక కుర్చీలో కూల వేసింది.

వాష్ బేసిన్ దగ్గరకు వెళ్లి ముఖం కడుక్కుంది, నీళ్లు చల్లుకుని, నేప్కిన్‌తో ముఖం తుడుచుకుంది.

ముకుందం కూడా అక్కడకు చేరుకున్నాడు.

ఆమె అతన్ని గమనించీ గమనించనట్లే ఉండిపోయింది.

'ముందు - పిల్లవాడికి పాలు, బిస్కత్తులు' - అన్నాడు ముకుందం వెయిటర్ రావడం తోటే.

'మీరేం తీసుకుంటారు ? ఏమన్నా తినండి. మరేం మొహమాట పడకండి'- అన్నాడు నింపాదిగా.

అమిత అతని ముఖంలోనికి గుచ్చి చూచింది. ఎవరు నువ్వు, ఎందుకిలా వెంటబడుతున్నావు - అని కోప్పడుతుందేమోననుకున్నాడు ముకుందం. కాని ఆమెకు నీరసంలో కోపం చేసుకునే శక్తి లేదు; పాపం - అనుకున్నాడు.

వెయిటర్ అందించిన నీళ్లు తాగేసింది ముందు.

'ఏం తీసుకుంటారు?' అనడిగాడు ముకుందం మళ్లీ. నీరసంగా వెయిటర్ వంక చూచింది అమిత.

'ఇడ్లీ తీసుకోండి ముందు. తరువాత ....'

వెయిటర్ వెళ్లిపోయాడు.

పిల్లవాడికి పాలు తాగించింది. వాడు చేతులూపుతూ ఏవో మాటలు అంటూ ఆడుకుంటున్నాడు.

'నూనె సరుకు. ఇక్కడ ఇంకేమీ వద్దు. మీకు రుచించదు. మరో రెండు ఇడ్లీలు తీసుకోండి' - అన్నాడు.

తిన్న తర్వాత ఆమెకు ఓపిక వచ్చినట్లు అయింది.

ముకుందం వైపు కాస్త ఆపేక్షగా చూచింది.

'బ్రెడ్ టోస్ట్ తీసుకుంటారా?'

తల అడ్డంగా ఊపింది ఆమె. 'టీ తాగుతాను' అంది.

'ఎందుకంత నీరసపడిపోయారు ? పిల్లవాడితో ఒంటరిగా ఎక్కడికి వెడుతున్నారు?' అన్నాడు ముకుందం చొరవ తీసుకుని.

'ఈ పిల్లవాడే - ఈ పిల్లవాడి కోసమే - లేకపోతే నాకేం అక్కర్లేదు' - అంది ఆమె - ఇంకా నీరసంగానే.

ముకుందానికి కొద్దిపాటి ధైర్యం వచ్చింది.

'ఎందుకంత హైరాన పడతారు? నిదానంగా ఉండండి' - అన్నాడు; ఏం మాట్లాడాలో తెలియక.

'ఎందుకు నిదానంగా ఉండాలి ? నాకు ఇవ్వాల్సిన డబ్బు నిలిపి వేశారు. వాళ్ల సుఖమే వాళ్లది. నేను ఏమయిపోయినా వాళ్లకేం పట్టదు. నా దుఃఖం - నా ఆకలి - నా పసివాడి ఏడుపు -' ఇంకా ఏమిటో చెప్పబోతోంది ఆమె.

దుఃఖం తెరలు తెరలుగా పైకి వచ్చింది.

గతమంతా మనసుకు వచ్చి అతలాకుతలం అయింది.

తనను ఉద్యోగం మానిపించడం -

ఆదాయం తక్కువయిందని మళ్లీ ఏడవడం -

తన మీద అనుక్షణమూ అధికారం చేయాలని చూడడం -

ఎంతో ప్రేమగా, అనురాగంగా ఉంటున్నానని నటించడం -

కుర్రవాడు పుట్టిన తర్వాత 'అదే పడి ఉంటుందిలే' - అన్న ధోరణిలో ప్రవర్తించడం-

వీడు నాకేం గుదిబండ కాదు, నా ఒంట్లో ఊపిరి ఉండగా - అని తను నిర్ధారణ తీసుకోవడం -

'తమాయించుకోండి. ఇప్పుడేం ఫరవాలేదుగా - కొద్దిగా' అన్నాడు ముకుందం.

'ఒక రోజుతో తీరిపోయేదా ? - దిన దినగండం, నూరేళ్లు ఆయుష్షు - -' అంది ఆమె.

ముకుందం ఏమనటానికి తోచక మాటల కోసం వెదుక్కుంటూ ఉండిపోయాడు.

'కష్టం ఎవరికైనా వస్తుంది-'

కష్టాలు కాపరం ఉండవు,

అందరికీ మంచి రోజులు వస్తాయి.

ఎప్పుడూ ఒకలాగే ఉండదు -

ఇలా విడివిడిగా పొడిపొడిగా మాటలు అంటున్నాడు.

'వాళ్లకే మంచి రోజులు - నాకూ, నా కొడుక్కూ అన్నీ కష్టాలే. అన్నీ ఆపదలే'- మళ్లీ దుఃఖం పొంగి వస్తోంది ఆమెకు.

వెయిటర్ బిల్ ఇచ్చాడు.

అమిత కొంగు ముడి అందుకోబోయింది.

'వద్దు నేను ఇస్తాను. మీ డబ్బు ఉంచండి. తరువాత కావలసి రావచ్చు' అన్నాడు.

'మీ కెందుకు? నా దగ్గర ఉన్నదిగా - ఆ ముసలి దయ్యం ఇప్పుడే కదూ ఇచ్చింది ఏడుస్తూ' - అంది అమిత.

ముకుందం ఆమెను ఇంకేమీ మాట్లాడ నివ్వలేదు.

రెస్టరెంట్ బయటకు వచ్చాక - ముకుందం మరింత వినయంగా అన్నాడు. 'ఇంటికి ఏమయినా తీసుకు వెళ్లండి. మళ్లీ బజారుకు రావాలంటే శ్రమ--'

ఆమె అతని వంక ఆశ్చర్యంగా చూచింది.

అతను పక్కనున్న పచారీ దుకాణంలోనికి నడిచాడు. ఆమె అడుగులో వేసుకుంటూ నడిచింది వెనగ్గా.

'అయిదు కిలోలు బియ్యం - పప్పూ, ఉప్పు, మిరపకాయలు - చింతపండు' ముకుందం నోటికి వచ్చిన, గుర్తు వచ్చిన పచారీ సరుకుల పేర్లు చెప్పాడు.

దుకాణం కుర్రవాడు చిన్న పేకట్లు మూడు తయారు చేసి ఇచ్చాడు. బిల్ ఎంతయిందో ఆమెకు తెలీదు. యాంత్రికంగా చెల్లించి, అతని వంక ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయింది.

పాకెట్లు చేతిలో పట్టుకుని రోడ్డు మీదకు వచ్చారు.

'ఎక్కడికి వెళ్లాలి మీరు ? నడవలేరు. నా టాక్సీలో దిగ విడుస్తాను' అన్నాడు.

'వద్దు. ఇప్పటికే చాల శ్రమ తీసుకున్నారు. చాలు, నెమ్మదిగా నడిచి వెడతాను' - సిగ్గు పడుతూ చెబుతోంది అమిత.

అతను వినిపించుకోలేదు.

టాక్సీ వైపు నడిపించాడు. కుర్రవాడిని అతనే ఎత్తుకుని ఉన్నాడు గనుక వెనక నడవడం తప్ప ఆమెకు మరో దారి లేదు.

టాక్సీలో కూర్చున్నాక అడిగాడు 'ఎక్కడ మీ ఇల్లు' చెప్పండి - తనకు తెలిసినా తెలియనట్లుగా ఉండిపోవాలి. తెలిసినట్లు కనిపించే పరిస్థితి కాదు. ముకుందం నటించడం నేర్చుకుంటున్నాడు.

ఆమె పేట పేరు చెప్పింది.

'నేనూ అటే వెడుతున్నాను. వేరే నాకేం ఇబ్బంది లేదు. మీ ఇంటి దగ్గర దిగవిడిచి వెడతాను - మరేం అనుకోకండి ?' అన్నాడు ముకుందం ఆమె అనుమతి కోరుతూ.

ఆమె చెప్పిన 'పేట' వచ్చింది. 'ఎటు వైపు?' అనడిగాడు.

'అదుగో ఆ మూల లాంతరు స్తంభం దగ్గర ఆపండి. దిగి వెళ్లిపోతాను'

'వద్దు, మీ ఇంటి దగ్గరే దిగుదురుగాని చెప్పండి. మీకేం బెంగవద్దు' అన్నాడు ముకుందం.

'ఉహూ. ఆ లాంతరు స్తంభం దగ్గరే ఆపండి. చాలు'

మళ్లీ రెట్టించి అడిగాడు అతను.

'చెప్పను. నేను ఎక్కడ ఉంటున్నానో చెప్పను, థాంక్స్, మీ సహాయానికి ఇక్కడే ఆపండి, చాలు'

ముకుందం వదలలేదు.

ఆమె అంత నీరసంలోను కోపంగా చురుగ్గా చూచింది. 'నేను ఎక్కడ ఉంటున్నానో తెలుసుకుందామనా? చెప్పను. ఆపండి' - అంది.

టాక్సీ లాంతరు స్తంభం దగ్గర ఆగింది.

ఆమె దిగి పిల్లవాడిని ఎత్తుకుంది.

ముకుందం మూడు పాకెట్లూ ఆమెకు అందించాడు.

భద్రంగా వాటిని రెండు చేతుల్లోను పట్టుకుని 'చాలా థాంక్స్, మీ సహాయానికి. అప్పుడే చీకటి పడిపోతోంది. వస్తాను' అని ఎదురు రోడ్డులోనికి గబగబ అడుగులు వేయసాగింది.

ముకుందం అక్కడే టాక్సీలో ఉండిపోయాడు.

ఆమె వెనక్కు తిరిగి చూస్తుందేమో అనుకున్నాడు.

ఆమె తల వంచుకుని ముందుకు వెడుతూనే ఉంది.

టాక్సీ వెనక్కు తిరిగింది.

* * *

జవాబు వ్రాయవలసిన ఉత్తరాలలో లత అక్కగారు రాసిన పెద్ద ఉత్తరం కూడా ఉంది. ఎప్పుడో తీరుబడి చూచుకుని బదులు రాయాలి.

అమిత గురించి ఆమెకేమీ బెంగలేదు. హాయిగా స్వంతానికి ఓ చిన్న ఇల్లు తీసుకుని అక్కడే ఉంటూంది అమిత. మళ్లీ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తోందట.

దొరకటం కష్టం కాదు.

అయినా ఏదో ఓ చిన్న ఉద్యోగంలో 'సెటిల్' అయిపోదు అమిత. తన చదువుకు హోదాకు తగిన హుందా అయిన ఉద్యోగమే కావాలి. కరుణాకరాన్ని కాదన్నందుకు ఏ మాత్రం తక్కువ కాకూడదు తన జీవితం.

అంతవరకు ఎన్ని కష్టాలు పడటానికయినా సిద్ధమే.

మా దగ్గరకు వచ్చి ఉండమంటే ఉండదు. వినదు. ఒట్టిపెంకి పిల్ల - అంటుంది లత అక్కగారు.

ఉన్న ఊళ్లోనే ఉండి ఆమెకు ఏమీ సహాయం చేయలేక పోతున్నామని బెంగ.

బతుకులో బరువులు, అతలాకుతలాలు.

ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు లేనివాళ్లు కూడా రోజులు గడపడంలో ఇబ్బందుల పాలు అవుతున్నారు.

వాళ్లు బయలుదేరుదాం అనుకుంటూ ఉండగానే కరుణాకరం వచ్చాడు.

'క్లబ్‌కు వస్తానన్నావట గదా ! అని పలుకరించాడు, మాధవరావు.

'వస్తానన్నాను. మీరు ఎలా వెడతారు ? అనుకూలంగా ఉంటుందని కారు తీసుకు వచ్చాను' - అన్నాడు లత ఇచ్చిన టీ చప్పరిస్తూ.

'మంచి పని చేశావు'

లత అన్నది రహస్యంగా తనతో 'క్లబ్‌లో మాట్లాడటానికి సమయం ఉంటుందో, ఉండదో అని ముందుగా ఇక్కడికే వచ్చినట్లున్నాడు. కాస్సేపు సమాధానంగా మాట్లాడండి ?

మాధవరావు కూడా రహస్యంగానే నవ్వాడు.

కమలాకరం డ్రైవ్ చేస్తున్నప్పుడు కార్లో వెళ్లటానికి చాలా హాయిగా ఉంటుంది మాధవరావుకు. ముఖ్యంగా తను డ్రైవ్ చేస్తూ ట్రాఫిక్ ఇబ్బందుల మీద మనసు పెట్టవలసిన అవసరం లేదు గనుక - అదో పెద్ద రిలీఫ్.

లత వెనుక కూర్చుంది.

మాధవరావు ముందుకే వచ్చి కరుణాకరం పక్కనే కూర్చున్నాడు.

డ్రైవ్ చేస్తున్నప్పుడు కబుర్లలోనికి దింపడు.

రోడ్డుకు రెండు పక్కల పనిలేని వాళ్లు ఎంతోమంది ఏవో పనులు భుజాల మీద వేసుకుని వడివడిగా - మందకొడిగా - నడుస్తూ ఉండడం చూడడంలోనే ఎంతో ఉత్సాహం ఉంది. భూభారమంతా మోస్తున్నట్లు కొందరు, ఏది ఎట్లా పోయినా మనకేం అని ధీమాతో రొమ్ము విరుచుకు నడిచేవాళ్లు కొందరు.

ఎక్కడికీ కదలకుండా మహాజనాన్ని ముందుకు చేరవేసే రోడ్డు; ఎన్ని మెలికలు తిరిగినా సూటిగానే కనబడుతూ ఉంటుంది.

కారు పార్క్‌చేసి వచ్చాక కమలాకరంతో అన్నాడు మాధవరావు, 'నీకేం దిగులు అక్కర్లేదు. పై వారం నేను ఊళ్లో ఉండను. లత వాళ్ల అక్కయ్యగారి ఊరుకు వెళ్లి అమితను తీసుకు వస్తుంది. అదే తేలికయిన పని.'

క్లబ్ మీటింగ్ అయిపోయిన తర్వాత శేఖరం దంపతులను కూడా కారులో ఎక్కించుకుని కమలాకరం 'రెస్టారెంట్'కు తీసుకు వెళ్లవలసి వచ్చింది. అతనికి ఆ ఉపన్యాసం అంతా శ్రద్ధగా వినడమూ తప్పనిసరి అయింది. ముందు ఎందుకు వచ్చిన బాదరీబందీ అనుకున్నాడు గానీ - తీరా విషయానికి వచ్చేసరికి ట్రాన్స్‌పర్సనల్‌సైకాలజీకి చెందిన ''భార్యభర్తల సంబంధాలలో అనురాగ సప్తకం''అతను విన్నదంతా - స-రి-గ-మ-ప-ద-ని.

పరస్పర అవగాహన ఎలా ఏర్పడుతుంది ?

దీని కోసం ముఖ్యంగా భర్తలు అవలంబించవలసిన జీవన మానసిక సూత్రాలు ఏమిటి ?-అన్నది శేఖరం అనే ఆ ఉపన్యాసకుడు అలవోకగా చెప్పుకుంటూ పోయాడు.

కుటుంబ విషయాలు, సరస సల్లాపాలు, అతివల చిరు అలుకలు, కాపురాలను చీల్చే కలహాలు - ఇటువంటి వాటి వెనక ఇంతగా జీవన సూత్రాలు, వాటి మదింపు

ఉంటుందని కమలాకరానికి ఇప్పుడే అర్థం అవుతూ వచ్చింది. మొత్తం మీద మాధవ రావు సలహా ఏం సహాయం చేస్తుందో తెలియదు గాని, ఈ ఉపన్యాసం మాత్రం అతని మనస్సును మహార్ణవంలో ముంచేసింది. ఈ కార్యక్రమం తరువాత అతను వెనకటి కరుణాకరం కాడు.

ఉపన్యాసం ఇచ్చిన శేఖరంతో పరిచయం పెంచుకుంటే బాగుండును - అనుకుంటున్న కరుణాకరాన్ని ఆయనే అకస్మాత్తుగా పలుకరించారు. అప్పటికి రెస్టారెంట్ రౌండ్ టేబుల్ ముందు అయిదుగురూ సుఖాసీనులయ్యారు. ఒక కుర్చీ ఖాళీగానే ఉండి పోయింది.

శేఖరం కరుణాకరంతో 'ఈ కుర్చీ ఖాళీగా ఉందనుకోకండి. మీకు పెళ్లయిందో లేదో నాకు తెలీదు. అయి ఉండి, మీ భార్య ఊళ్లో ఉన్నట్లయితే ఆమె కూడా ఇక్కడికి ఇప్పుడు వచ్చి ఉండేవారు గదా. పెళ్లి కాకపోయినా ఆమె ఆగమనం కోసం ఈ కుర్చీ ఖాళీగానే ఉంచాలి. అందుచేత మీ భార్య ఇప్పుడు ఇక్కడ కూర్చుని ఉన్నట్లే లెక్క!' అన్నాడు.

కరుణాకరం కృతజ్ఞతగా నవ్వుతూ, 'పై వారం అమిత ఇక్కడకు వస్తుంది. అనుకున్న ప్రకారం నేను నడుచుకోగలిగితే పై నెలలో మళ్లీ మేమిద్దరం హాయిగా కాపురం చేసుకుంటాం అనుకున్నాడు మనసులోనే.

'అమితను నువ్వు తీసుకు వెళ్ళకుండా ఉండడం ఏ మాత్రం బాగాలేదు. ఆ అమ్మాయి చాల అభిమానం కలపిల్ల. తల్లిగారి ఇంట ఉండదు. మా దగ్గరకు రమ్మన్నా రాదు. మేమిద్దరం ఊళ్లోనే ఉండి ఏమీ చేయలేకపోవడం మాకే సిగ్గుగా ఉంది. ప్రత్యక్షంగా చూస్తూ ఉన్నా ఇంకా నువ్వు వీసమెత్తయినా మారకపోవడం మాకు ఆశ్చర్యంగా ఉంది - మొన్న సబ్-వే దగ్గర కనిపించి మమ్మల్నందరినీ ఏమీ అనకపోయినా దాదాపు దుమ్మెత్తి పోసినట్లుగా మాట్లాడింది. అమ్మాయి చాలా చిక్కిపోయింది, కరుణా. ఎంతో బలవంతం చేసి అయిదువందల రూపాయలు చేతికి ఇచ్చాను. ఆలస్యం చేయడం మంచిది కాదు. తరువాత నీ ఇష్టం-' అని తల్లిగారు పోయిన వారం వ్రాసిన ఉత్తరం అతని బుర్రలో మెదిలి, అక్షరాలు పేర్చుకుని కళ్ల ముందు ఆడుతున్నట్లు

అనిపించింది.

మాధవరావు కరుణాకరాన్ని గమనిస్తూనే ఏమీ ఎరుగనట్లుగా కూర్చుండి పోయాడు.

లత 'ముకుందం ఎవరు?' అని అడగడం అతనికి గుర్తు వచ్చింది.

ఎవరో దారిన పోయే దానయ్య - పరోపకారి పాపన్న అలాంటి కోవకు చెందినవాడు. అతన్ని గురించి నీకు ఆలోచన ఎందుకు ? అమిత అతని మీదేమీ ఫిర్యాదులు చేయలేదుగా నీకు !' - అని సమాధానం చెప్పి తప్పించుకున్నాడు అప్పటికి.

ఎన్నడూ ఎరగని వాళ్లు కూడా ఎంతో మంచితనం చూపగలరు, తమకు ఏ మాత్రం అవసరం లేకపోయినా ఇతరులకు సహాయం చేయటానికి ఉబలాటం చూపగలరు - అనే అభిప్రాయాలు అమితలో కలిగించి, ఆమెను కరిగించటానికి దోహదం చేసింది అతనేనని లతతో చెప్పడం - అప్పుడు అవసరం అనుకోలేదు మాధవరావు.

కరుణాకరం ముఖంలో నిండుగా పులుముకున్న ఆనందం ఏమిటో లతకు తెలియదు. తమను ఇంటి దగ్గర దింపేసిన తరువాత, పోర్టికోలో నిలబడి ఉన్న లత, మాధవరావు ఈ విషయం ఎలా సమరసంగా సాధిస్తాడా అని ఇంకా ఆలోచిస్తూనే ఉంది.

✦